# లెవెన్త్ సెప్టెంబర్

– మల్లాది వెంకట కృష్ణమూర్తి

ఆ రోజు న్యూయార్క్ సిటీ సివిల్ కోర్ట్ కార్యాలయంలోని ఫిఫ్త్ కోర్ట్‌లో, ఓ కేసు తాలూకు తీర్పు. జడ్జి మిసెస్ రాషెల్ తన తీర్పుని చదవడానికి కాగితాలని అందుకుంది. ఆ కేసు మిస్టర్ సారథి వర్సెస్ మిసెస్ సారథి రాధామణిల విడాకుల కేసు.

అంతకు కొన్ని వారాల ముందు...

---

ఆరోజు సెప్టెంబర్ 11 సోమవారం. ఆ రోజు సారథి, రాధామణిల మేరేజ్ ఏనివర్సరీ డే. వాళ్ళకి ఆంధ్రప్రదేశ్‌లోని పెదనందిపాడులో వివాహం జరిగి ఆ రోజుకి సరిగ్గా ఏడేళ్ళయింది.

అమెరికా వచ్చాక ప్రతీ ఏనివర్సరీకి ఇద్దరూ తాము పనిచేసే ఆఫీస్‌లకి సెలవు పెట్టి, స్వాగత్, వసంద్ లేదా నమస్తే లాంటి ఇండియన్ రెస్టారెంట్స్‌కి వెళ్ళి లంచ్ తీసుకుని, బ్రాడ్వేలో ఏదో ఓ పాపులర్ డ్రామాకి వెళ్ళి, మినీ ఇండియాలో షాపింగ్ చేసి ఇంటికి చేరుకుంటారు. ఆ రాత్రి ఛిల్డ్ షాంపేన్ బాటిల్ తెరుస్తారు.

వాళ్ళకి వివాహమైనప్పటినించి వారు, తమకి అరుదుగా దొరికే సెలవుని తమ మేరేజ్ ఏనివర్సరి రోజు అలా ఎంజాయ్ చేస్తున్నారు.

వాళ్ళ పెళ్ళయిన ఎనిమిదవ సంవత్సరం అది. ఉదయం నిద్ర లేచిన రాధామణి భర్తతో చెప్పింది. "ఛ ! ఈ రోజు మీకు శెలవు దొరక్కపోవడం ఎంతో విచారకరం".

"ఏం చెయ్యను? మా కొత్త బాస్ గురించి రెండు నెలలుగా చెప్తున్నానా? వాడికి ఏషియన్స్ అంటే పడదు. ముఖ్యంగా ఇండియన్స్ అంటే!

"వాడి భార్య యోగా నేర్పించే ఇంగ్లీష్ టీచర్‌తో లేచిపోయినంత మాత్రాన ఇండియన్ కమ్యూనిటీ మీద కోపం పెంచుకోవడం ఇడియోక్రసి. సైకియాట్రిక్ సెషన్స్‌కి వెళ్ళమని చెప్పండి".

"అసలు నేనో పొరపాటు చేశాను మణీ. మన మేరేజ్ ఏనివర్సరి కాబట్టి శెలవు ఇమ్మని కోరాను. తన భార్య ఇండియన్ యోగా టీచర్‌తో లేచిపోయింది కాబట్టి ఇండియన్ దంపతులమైన మనకి సెలవు ఇవ్వనని సేడిస్టిక్ ప్లెషర్ కోసం అడ్డుపడ్డాడు".

"సన్నాఫేబిచ్" కోపంగా చెప్పింది రాధామణి.

"సాయంత్రం బ్రాడ్వేలో మనం అనుకున్న చోట కలుద్దాం. అక్కడ నించి ఈ రాత్రి ఏదైనా బార్‌లోనే షాంపేన్ తీసుకుని ఇంటికి టాక్సీలో వెళదాం. మన కార్లు ఎవరైనా ఫ్రెండ్ పికప్ చేసి ఇంటికి తెచ్చే ఏర్పాటు చేస్తాను".

ఇద్దరూ ఇంట్లోంచి బయలు దేరే దాకా రాధామణి గొణుగుతూనే వుంది. ఇద్దరూ చెరో కార్లో తమ తమ ఆఫీస్‌లకి బయలుదేరారు.

సారథి తన కారుని ఓ అండర్ గ్రౌండ్ రైల్వేస్టేషన్ బయట పార్క్ చేసి, సబ్‌వే స్టేషన్‌లోకి వెళ్ళాడు. అయితే రోజూ ఎక్కి వెళ్ళే రైలు ఎక్కలేదు ఆ రోజు. బదులుగా ఆపోజిట్ సైడ్ వెళ్ళే రైలు ఎక్కాడు.

తొమ్మిదో స్టేషన్‌లో దిగి మెట్లెక్కి పైకి వచ్చాడు. టాక్సీ తీసుకుని ఇరవై నిముషాల దూరంలో వున్న ఓ బ్లాక్ ముందు దిగాడు. సందేహించకుండా ఆ బ్లాక్ దగ్గరకి నడిచాడు.

తన జేబులోంచి సెల్ ఫోన్‌ని తీసి తన భార్య సెల్‌కి ఫోన్ చేశాడు. అవతలి వైపు నించి ఆశగా వినబడింది రాధామణి కంఠం.

"శెలవు దొరికిందాండీ?"

"ఇంకా నేను ఆఫీస్‌కే చేరలేదు. ఇంక ఆ ఆశ వదులుకో. నీకు మన మేరేజ్ ఏనివర్సరి గ్రీటింగ్స్ చెప్దామని ఫోన్ చేశాను. ఉంటాను".

లైన్ కట్ చేసి సెల్ ఫోన్‌ని జేబులో వేసుకుని లోపలికి నడిచాడు. నీగ్రో లిఫ్ట్‌బాయ్ సారథిని గుర్తుపట్టినట్లుగా నవ్వి తల ఊపాడు. సారథి ఫ్లాట్ నంబర్ చెప్పకుండానే అతను ఏడో నంబర్ బటన్ నొక్కాడు. కొద్ది సేపట్లో లిఫ్ట్‌లోంచి బయటకి వచ్చిన సారథి ఆ ఫ్లోర్‌లోని 'సెవెన్ సి' నంబర్ అపార్ట్‌మెంట్ దగ్గరకి వెళ్ళి డోర్ బెల్ నొక్కాడు. దాదాపు నిముషం

తర్వాత తలుపు కొద్దిగా తెరచుకుంది. లోపలినించి కమ్మటి వాసన వేసింది. బయట వున్నది సారథి అని గ్రహించగానే మిస్ మల్హోత్రా లోపల తలుపుకున్న చెయిన్‌ని రిలీజ్ చేసి తలుపు మొత్తం తెరచి చిరునవ్వుతో ఆహ్వానిస్తూ చెప్పింది.

"కమిన్"

సారథి లోపలకి వెళ్ళగానే ముందు ఆమెని గాఢంగా చుంబించాడు. ఆ కమ్మటి వాసన ఆమె రాసుకున్న టాల్కం పౌడర్‌ది. ఆ పని చేస్తుంటే, ఆమె కాలితో తలుపుని తన్ని దాన్ని మూసింది. ఒకరినొకరు బాగా ఇష్టపడుతున్నారని అలా రుజువు చేసుకున్నాక మిస్ మల్హోత్రా బెడ్‌రూంలోకి నడిచారిద్దరూ.

సారథి మంచం మీదకి చేరబోయే ముందు చేసిన ఆఖరి పని తన సెల్ ఫోన్‌లో టైం చూసి, దాని స్విచ్ ఆఫ్ చేయడం. అప్పుడు టైం తొమ్మిదీ ఇరవై.

– – –

గతంలో సారథి, మిస్ మల్హోత్రా ఒకే ఆఫీస్‌లో పనిచేసేవారు. అయితే వాళ్ళ మధ్య మొదలైన అఫైర్ ఆనోటా, ఈనోటా రాధామణి చెవులకి సోకడానికి ఎక్కువ టైం పట్టలేదు. ఏడేళ్ళకి పైగా అమెరికన్ సొసైటీలో నివశిస్తున్న రాధామణికి సారథి నించి విడాకులు తీసుకోవాలన్న ఆలోచన కలగడం సహజం. కాని సారథి తన తప్పు వప్పుకుని ఇంకెన్నడూ అలాంటి పొరబాటు చేయనని ప్రాధేయపడ్డాక, ఆ ఉద్యోగం తక్షణం మానేయాలన్న కండిషన్ మీద రాధామణి అతన్ని క్షమించింది.

ఇది జరిగి ఆర్నెల్లు కూడా కాలేదు. వీకెండ్స్‌లో ఎటూ కుదరదు. దాంతో వర్కింగ్ డేస్‌లో సారథి ఇక్కడ అరగంట, అక్కడ గంట దొంగిలించి, ఆ సమయంలో మిస్ మల్హోత్రా ఫ్లేట్‌లో ఆమెతో గడపడానికి అలవాటు పడ్డాడు. అలా ఇప్పటికి నాలుగుసార్లు కలుసుకున్నారు. ఇదివరకటి కన్నా టైం తక్కువగా వుండడంతో, ఇద్దరూ ఆనందాన్ని మిస్ అవకూడదన్న తలంపుతో ఇంకాస్త హుషారుగా ప్రవర్తిస్తూండడంతో వాళ్ళకి గతంలో కన్నా ఆనందం ఎక్కువైన భావన కలగసాగింది.

– – –

సారథి తల దువ్వుకున్నాక లేచి వెళ్ళి అద్దంలో చూసుకున్నాడు. తల కరెక్ట్‌గానే దువ్వుకున్నాడు.

సారథి తన జేబులోని సెల్‌ఫోన్ తీసి స్విచాన్ చేసి టైం చూశాడు. పదకొండు ముప్పై అయిదు.

ఓ అడుగు వేశాడో లేదో సెల్‌ఫోన్ రింగయింది. కాల్ ఎవరి నించో నంబర్ చూశాడు.

తన భార్య సెల్ నించి. ఆ కాల్ రిసీవ్ చేసుకుని చెప్పాడు. "మణీ. నేనే. ఏమిటి?"

"మీరెక్కడున్నారు? ఎలా వున్నారు?" తన భార్య కంఠం. హిస్టీరికల్‌గా వినబడటంతో అతనికేం అర్థం కాలేదు. "ఆర్‌యూ ఓకే?" అరిచింది రాధామణి అవతలినించి.

"వెరీమచ్. ఏమైంది. అలా అడుగుతున్నావ్?" అడిగాడు సారథి.

"మీరెక్కడున్నారు? ఆఫీస్‌కి ఎందుకు వెళ్ళలేదు?" అడిగింది రాధామణి మళ్ళీ.

"ఎందుకెళ్ళలేదు? నేనిప్పుడు నా ఆఫీస్‌లోనే వున్నాను. అదా... ఇందాక మీటింగ్‌కి హాజరై సెల్‌ఫోన్ ఆఫ్ చేశాను."

"యూ.. యూ.. ఇడియట్... దొంగ వేధవ్వేషాలు ఇంకా మానలేదన్న మాట" ఉగ్రంగా అరిచింది రాధామణి. వెంటనే లైన్ కట్ చేసింది.

తన భార్య ఈ సంగతి ఎలా అర్థం చేసుకుందో సారథికి అంతుపట్టలేదు. తన ఆఫీస్‌కి ఫోన్ చేసి తను ఇంకా రాలేదని తెలుసుకుని వుంటుందన్న ఆలోచన కలిగింది. కాని ఎమర్జన్సీలో కాని తన ఆఫీస్ నంబర్‌కి ఫోన్ చేయకూడదన్నది వాళ్ళ మధ్య నియమం.

అప్పుడే మిస్ మల్హోత్రా ఆన్ చేసిన టి.వి. వంక అన్యమనస్కంగా చూశాడు. అమెరికాలో ఏ టి.వి. ఛానల్‌లోనైనా ఆరోజు ప్రసారమైన కార్యక్రమం అదొక్కటే. న్యూయార్క్‌లో సారథి 103వ అంతస్థులో పనిచేసే ఆఫీస్ వున్న వరల్డ్ ట్రేడ్ సెంటర్ తాలూకు ట్విన్ టవర్స్‌ని, కొద్ది నిముషాల తేడాలో టెర్రరిస్ట్‌లు ఉదయం తొమ్మిదికి కూల్చిన సంఘటన టి.వి.లో కనిపిస్తోంది. ఆ సంఘటనతో ముడిపడ్డ మొదటి విడాకుల కేసులో రాధామణి పక్షంగా తీర్పు చెప్పింది జడ్జి మిసెస్ రాషెల్.

○